



కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో కల్తీసారా బాధితులను పరామర్శిస్తున్న చంద్రబాబు. ★ తుని జాతీయ రహదారిపై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ★ విశాఖ జిల్లాలో బాధిత కుటుంబీకులకు రూ.15వేల ఆర్థిక సహాయం

**రాష్ట్రంలో వరుస దుర్ఘటనలకు**

# ప్రభుత్వమే జవాబుదారీ

- బాధితులకు న్యాయం చేయాలి
- లేకుంటే ఆందోళనలు చేస్తాం
- 'తాండవ' బాధితులకు రూ.5లక్షల పరిహారమివ్వాలి
- చంద్రబాబు డిమాండ్
- తూర్పు, విశాఖ జిల్లాల్లో బాధితులకు పరామర్శ

కాకినాడ, విశాఖపట్నం - న్యూస్‌టుడే

రాష్ట్రంలో వరుసగా జరిగిన పలు దుర్ఘటనలకు, తద్వారా సంభవించిన మరణాలకు ప్రభుత్వమే జవాబుదారీ అని తెదేపా అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. బాధితులందరికీ సర్కారు న్యాయం చేయాలని, లేకుంటే తెదేపా ఆందోళనలకు దిగుతుందని హెచ్చరించారు. ఆయన గురువారం తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో పర్యటించారు. తొలుత కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో కల్తీసారా, అమ్మోనియా లీకేజీ బాధితుల్ని.. అనంతరం విశాఖ జిల్లా గొలుగొండ మండలం కె.డి.పేటల్లో 'తాండవ' ప్రమాద బాధితుల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మాట్లాడుతూ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. వరుసగా ఇన్ని దుర్ఘటనలు జరుగుతున్నా సర్కారు ఇసుమంతైనా స్పందించడంలేదని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేవారే కరవయ్యారని దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన నాలుగు సంఘటనల్లోను ముఖ్యమంత్రిగాని, మంత్రులుగాని రాలేదని.. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి కనపడడం లేదు. మంత్రులు ఏం చేస్తారో తెలీదు. వారికి పేదల కష్టాలు పట్టడం లేదు' అని ధ్వజమెత్తారు. కల్తీసారా మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఈ దుర్ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను తక్షణం ఎత్తేయకపోతే తెదేపా తరపున ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తాండవ దుర్ఘటనలో బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా మూలనపడ్డాయని దుయ్యబట్టారు. ఎన్నికల కోసం వాగ్దానాలు చేయడం.. తర్వాత విస్మరించడం కాంగ్రెస్‌కు అలవాటేనని ఎద్దేవా చేశారు. వ్యాట్ పేరుతో ఇప్పటికే ప్రజలపై రూ.వెయ్యి కోట్ల భారం మోపారని.. ఇది చాలదన్నట్లు కిరోసిన్, డీజిల్, పెట్రోల్‌తోపాటు వంటగ్యాస్ ధరలు పెంచడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. తాండవ రిజర్వాయరులో పుట్టి మునిగిన దుర్ఘటన దారుణమని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పి ఓదార్చారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.15వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

**30 ఏళ్లైనా ప్రాజెక్టులు పూర్తికావు:** రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి పథకాలను పూర్తిచేయాలంటే కనీసం రూ.3లక్షల కోట్లు అవసరమవుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. అయితే ప్రతిఏటా రూ.10వేల కోట్లు కూడా ఖర్చు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉండడంతో మరో 30 ఏళ్లలో కూడా ఇవి పూర్తయ్యేలా లేవన్నారు. నీటిపారుదల పథకాలను చూస్తుంటే ఇప్పుడు వైఎస్ బతికున్నా ఏమీ చేయలేని పరిస్థితి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అంతకుముందు కాకినాడ నుంచి విశాఖపట్నం రోడ్డుమార్గంలో బయలుదేరిన చంద్రబాబు.. మధ్యలో పిఠాపురం వద్ద రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లో దెబ్బ తిన్న మినుము పంటల్ని పరిశీలించారు. ప్రభుత్వం 50శాతం సబ్సిడీ అంటూ నాసిరకం విత్తనాల్ని సరఫరా చేసి రైతుల్ని నిలువునా మోసం చేసిందని ధ్వజమెత్తారు. కత్తిపూడి, తుని, పాయకరావుపేట, కోటనందూరు కూడళ్ల వద్ద పార్టీ శ్రేణులను పలకరిస్తూ, అక్కడక్కడా క్లుప్తంగా ప్రసంగించారు.

**ఆర్థికంగానూ కార్యకర్తలకు ఆసరా:** ఎప్పుడూ గంభీరంగా ఉంటూ 'నేను నిద్రపోను మిమ్మల్ని నిద్రపోనివ్వను' అంటూ పార్టీ శ్రేణులను సమాయత్తపరిచే చంద్రబాబు.. విశాఖలో మాత్రం దీనికి పూర్తి భిన్నమైన ధోరణిలో కనిపించారు. నవ్వుతూ, నవ్విస్తూ కార్యకర్తలతో మమేకమయ్యారు. 'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు మహాబలం, ప్రాణం. మీ రుణం తీర్చుకోలేను. మిమ్మల్ని రాజకీయంగా, ఆర్థికంగా అన్నివిధాలా ఆదుకోవడం నా బాధ్యత. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉచిత విద్య వంటివి ఇప్పటికే అందిస్తున్నాం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా కార్యకర్తలు ఎదగడం కోసం ట్రస్టు ద్వారా రూ.లక్ష వరకు వడ్డీలేని రుణాలను ఇచ్చే యోచన కూడా ఉంది' అని పేర్కొన్నారు. తాను కూడి కింది స్థాయి నుంచే వచ్చానని, విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు జెండాలు కట్టానని, నేతలకు స్వాగతం చెప్పానని తెలిపారు. 'రోజంతా రాజకీయమంటూ తిరిగితే ఇంట్లో భార్య తిడుతుంది. నాకూ ఆ సమస్య ఉంది. అందునా ఆర్థికంగా ఇబ్బంది ఉంటే ఇంట్లో మరీ సమస్య. ప్రశాంతత ఉండదు. అందుకే కుటుంబానికి కొంత సమయం కేటాయిస్తే సమస్యలు పరిష్కారమవుతాయి' అని సూచించారు.